విశిష్ట గుర్తింపు.. ప్రయోజనాల వర్తింపు?

ఆధార్ కార్డు తరహాలోనే రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యతో కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఈ కార్డులు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

- వ్యవసాయ పరికరాలు, ఇతర రాయితీలు పొందేందుకు అవకాశం
- కానీ చాలామంది రైతుల ఆధార్‌కు లింక్ కాని ఫోన్ నంబర్లు
- ఈ నెలాఖరు వరకే అవకాశం అని చెప్పడంతో రైతుల్లో టెన్షన్
- పథకాలు తగ్గించేందుకే విశిష్ట గుర్తింపు సంఖ్య ?


ఆముదాలలో రైతులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పాలసముద్రం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల్లో (రైతు భరోసా కేంద్రాలు) ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. పట్టాదారు పాసుపుస్తకం, వన్ బీ, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో 40 వేల మంది రైతులు ఉన్నారు. చాలామంది రైతులకు ఈ కార్డుల గురించి ఇంకా తెలియకపోవడం, వ్యవసాయ అధికారుల సిబ్బంది కొరత ఉండడంతో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా పదుల సంఖ్యలో కూడా ఆన్‌లైన్ కాలేదు. చాలామంది రైతులకు తమ ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్ లింకు కాకపోవడం కూడా ఒక కారణం. అలాగే రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో ప్రతి సర్వే నంబర్‌కు నూతనంగా ఎల్పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) నంబర్లు కేటాయించారు. ఎల్పీఎం నంబర్లు ఆన్‌లైన్‌లో రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూమి తక్కువ ఉన్న రైతులకు ఎక్కువగా, ఎక్కువగా ఉన్న రైతులకు తక్కువగా చూపిస్తుండడంతో ఏం చేయాలో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

ఒకేసారి అన్ని రైతుసేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా రైతులకు ఓటీపీలు కూడా రావడం లేదు. రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

బోలెడు ప్రయోజనాలు

ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్‌తో జారీ చేసే ఈ కార్డులు రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను రైతుల యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో ఈ యూనిక్ నంబర్ ఉన్న వారికే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటబీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై యంత్ర పరికరాలు, పంట రుణాలు తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుంది. అలాగే ఈ యూనిక్ నంబర్‌ను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన సేవలను పొందవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు.

నమోదు ఇలా

వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడే. ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానమై ఉండాలి. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలి. ఈ ఆధారాలతో రైతు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ ద్వారా కేటాయిస్తారు. ఆ నంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేని రైతులకు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అందించి ఓటీపీ చెప్పడం ద్వారా నమోదు పూర్తిచేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో కొందరి భూమి లేదు



కొందరికి రైతులకు పట్టాదారు పాసుపుస్తకం ఉంది. ఆన్‌లైన్‌లో వన్‌బీ కూడా వస్తుంది. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింకు అయింది. అయితే ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న అన్నదాతకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే రెండవ ఓటీపీ వచ్చిన తరువాత సర్వే నంబర్ ఎంపిక రావాలి. అందులో సర్వే నంబర్ రాలేదు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వ పథకాలు తగ్గించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఇలాంటి అన్నదాతలకు విశిష్ట గుర్తింపు సంఖ్యలు ఇస్తున్నారు.

–ధనుంజయరెడ్డి, సీఎం కండ్రిగ

సమయం పెంచాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియ నమోదుకు ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉందని అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియ చేయాలంటే కొందరికి ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింకు ఉండదు. ఫోన్ నంబర్ లింక్ చేసుకున్న తరువాతే రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ చేయాలి. దానికి వారం రోజులకు పైగా అవుతుంది. ఇలా మండలంలో చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల గడువు పెంచాలి.

–కే.రాజేంద్రన్, రైతు

ఆందోళన వద్దు



ఆధార్ కార్డు తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం వన్‌బీ, ఆధార్ కార్డు, లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకొచ్చి రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. ఇది ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలి. లేకుంటే ప్రభుత్వాలు అందించే పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం కోల్పోతారు. గ్రామాల్లో జాయింట్ ఎల్‌సీఎం నంబర్ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

–ఢిల్లీ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


మాజీ మంత్రికి ఆహ్వానం పలుకుతున్న నాయకులు

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేట అరుణాచలేశ్వర ఆలయంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం నిర్వాహకులు మాజీ మంత్రి ఆర్కేరోజాకు మర్యాదపూర్వకంగా అందజేశారు. ఉత్సవాల్లో పాల్గొనాలంటూ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఆర్‌పేట వైఎస్సార్ సీపీ నాయకుడు అయ్యప్ప, సురేష్, కౌన్సిలర్ బీడీ భాస్కర్, మురుగ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

పాలసముద్రం: మండలంలోని నరసింహాపురంలో సారా తయారు చేస్తున్న వ్యక్తి ఆదివారం అరెస్టు, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. నరసింహపురం కొండ సమీపంలో సారా తయారు చేస్తున్న వ్యక్తి జీవాను అరెస్టు చేసి అతని నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే సారా బట్టీలను ధ్వంసం చేశామని తెలిపారు. నిందితుడు జీవాపై కేసు దర్యాప్తు చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు.

ఆశా కార్మికులకు ఉద్యోగ భద్రతేది?



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: ఆశ కార్మికులకు జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోదండయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామర్రై డిమాండ్ చేశారు. నగరి పట్టణంలో ఆదివారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత అధ్యక్షతన నిర్వహించిన ఆశ వర్కర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్మికులకు జీతాలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ఏఎన్ఎంగా నర్స్ ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలను ఏఎన్ఎంలుగా తీసుకుంటామని హామీ ఇచ్చి ఇంతవరకూ పరిష్కార మార్గాలు చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షీభా, రూప, పుష్ప, గౌరీ, పవిత్ర, భువన, లక్ష్మీ, మోహన, రేవతి పాల్గొన్నారు.

పల్లెసీమల్లో పరిశుభ్రతకు పెద్దపీట

శ్రీరంగరాజపురం: పరిశుభ్రతకు పెద్దపీట వేస్తునట్లు ఈఓపీఓఆర్డీ కోదండరామిరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కృషి చేయాలన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ముద్దుకుప్పం, తయ్యూరు పంచాయతీల్లో చెత్త సేకరణను తనిఖీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు తర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముద్దుకుప్పం సర్పంచ్ గిరిబాబు, తయ్యూరు సర్పంచ్ వరదమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణకు యత్నం


రోడ్డుకు అడ్డంగా మట్టిన తోలిన దృశ్యం

శ్రీరంగరాజపురం: ప్రభత్వంలోని ఆర్టీసీ ఉద్యోగి. .సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ఆస్తులను కాపాడతారు. కానీ ఈయన ఏకంగా ప్రభుత్వం వేసిన రోడ్డునే ఆక్రమించాలని చూశారు. ఈ సంఘటన ఆదివారం మండలంలో వెలుగు చూసింది. సింధురాజుపురం గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ బాబు నాయుడుకు చెందిన పొలం పక్కన కాలువ ఉంది. కొండరాజుపురం ఎస్టీ కాలనీకి ఆ కాలువ పక్కన మట్టిరోడ్డు వేశారు. ఈ రోడ్డును ఆక్రమించుకోవడానికి ఆదివారం రోడ్డుకు అడ్డంగా బాబునాయుడు మట్టిని పోయించాడు. విషయం తెలిసి స్థానిక గ్రామస్తులు అడ్డుకుని తహసీల్దార్ లోకనాథపిళ్లై రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. తహసీల్దార్ ఆదేశాలతో ఆర్‌ఐ ప్రభాకర్ ఘటనా స్థలికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టిని తొలగించి కొండరాజపురం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ ప్రభాకర్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ స్థలాలను, కాలువలను, రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

25న రుణాలకు ఇంటర్వ్యూలు

గంగాధర నెల్లూరు: మండల పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు లబ్దిదారుల ఎంపిక కోసం ఈనెల 25వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత బ్యాంకు మేనేజర్లు, అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


వడమాలపేట: ఎస్‌బీఆర్‌పురం గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేస్తున్న కార్యదర్శి


విజయపురం: బూచివానత్తంలో తడి, పొడి చెత్తను సేకరిస్తున్న కార్యదర్శి

విజయపురం: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ సూచించారు. బూచివానత్తంలో తడి పొడి చెత్తపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి, సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు. పరిసరాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంపై గ్రీన్ అంబాసిడర్లకు సూచన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వడమాలపేట మండలంలో..

సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎస్‌బీఆర్‌పురం కార్యదర్శి విజయ్‌భాస్కర్ అన్నారు. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురంలో ఆదివారం తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా పరిసరాల శుభ్రత పాటిస్తామంటూ ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో పేడదిబ్బలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణిరాజు, వైద్య ఆరోగ్య, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్త సేకరణ తనిఖీ

గంగాధర నెల్లూరు: గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు చేరవేసే కార్యక్రమాన్ని ఆదివారం ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పలు పంచాయతీలలో పరిశీలించారు. రెండురోజులుగా మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఇంటింటా చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించామన్నారు. వర్మీకంపోస్టు తయారీ వంటి అంశాలను మెరుగుపరుచుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

పంచాయతీ ఆదాయం పెంచుకోవాలి

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి, విస్తరణాధికారి రమేష్ తెలిపారు. ఆదివారం బాలకృష్ణాపురం పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఇంటింటా చెత్త సేకరణ

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో ఆదివారం ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ నాగరత్నమ్మ, సర్పంచ్ ధనుంజయవర్మ ఇంటింటా చెత్తసేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

స్వచ్ఛ గ్రామాల ఏర్పాటుకు సహకరించాలి

వెదురుకుప్పం: స్వచ్ఛ గ్రామాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. ఆదివారం మండలంలోని నల్లవెంగనపల్లె, జక్కిదొన, గంటావారిపల్లె, మాంబేడు, పాతగుంట పంచాయతీల్లో పంచాయతీ విస్తరణాధికారి పురుషోత్తం ఆధ్వర్యంలో ముమ్మరంగా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అంతర్గత రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించారు. అదేవిధంగా మురుగునీటి కాలువల్లో ఉన్న మురుగును తొలగించి శుభ్రం చేశారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఇంటింటికీ చెత్తను సేకరణను చేపట్టినట్లు ఈఓపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నటుల్ పేర్కొన్నారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని సూచించారు. ఇష్టానుసారంగా చెత్తను నివాసాల వద్ద డంప్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కుమార్, సర్పంచ్ పుష్ప పాల్గొన్నారు.


కార్వేటినగరం: చెత్తసేకరణలో సిబ్బంది



జీడీనెల్లూరు: ముక్కలతూరులో పర్యటిస్తున్న ఎంపీడీఓ, పాలసముద్రం: చెత్త సేకరిస్తున్న సిబ్బంది


వెదురుకుప్పం: చెత్తను సేకరిస్తున్న అధికారులు

కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ


కరాటేలో సాధించిన కప్పులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

నగరి: తమిళనాడులోని ఆర్కాడులో జపాన్‌షిటోరాయ్ సంస్థ నిర్వహించిన కరాటే పోటీల్లో నగరి పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక జపాన్ షిటోరాయ్ కరాటే పాఠశాలలో కరాటే అభ్యసిస్తున్న విద్యార్థులు ఆదివారం కరాటే పోటీల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 10 మంది ప్రథమ స్థానాన్ని, ఆరుగురు ద్వితీయ స్థానాన్ని, ఏడుగురు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకొని కప్పులు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు కరాటేమాస్టర్ రాజ్‌కోటి తెలిపారు.

వైభవంగా మహా కుంభాభిషేకం

కార్వేటినగరం: మండల పరిధిలోని ఎస్ఎన్ కండ్రిగ గ్రామంలో వెలసిన శ్రీకరికమాని గంగమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో టీటీడీ వారి సహకారంతో మంజూరు చేసిన రూ.10 లక్షలతో పాటు దాతల సహకారంతో నిర్మించిన ఈ ఆలయంలో మహా కుంభాభిషేకాన్ని మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వేద పండితులు వేద మంత్రాలతో 160 కలశాలు ఏర్పాటు చేసి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే ఆలయ గోపురంపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కలశాలకు ప్రత్యేక పూజలు చేసి పవిత్ర జలాలతో అభిషేకించారు. మహా కుంభాభిషేకానికి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వెయ్యిమందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సంజీవకృష్ణ మందడి, వైస్ చైర్మన్ రామకృష్ణ మందడి, సురేష్ మందడి, కాంతారావు, ఆనందమందడి, మార్కొండయ్య, పలువురు, భక్తులు పాల్గొన్నారు.


కరికమాని గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జీవం ఉట్టిపడేలా క్షీర సాగర మథనం


ఆకట్టుకుంటున్న క్షీరసాగర మథనం సెట్టింగ్

నగరి : మునిసిపల్ పరిధి కీళపట్టు త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయ ఆవరణలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏడాది వినూత్న అమరికలు చేపట్టడం పరిపాటిగా వస్తోంది. ఈ ఏడాది ఆలయం వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపడతారనే ఉత్కంఠ కూడా ప్రజల్లో ఉంటుంది. ఈ ఏడా క్షీరసాగర మథనం ఘట్టాన్ని బంకమట్టి వాడి శిలారూపంలో మలిచారు. ఈ అమరికలు చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దేవదానవులు అమృతం కోసం క్షీరసాగర మథనం చేస్తే తొలుత హాలాహలం పుట్టిందని అది శివుడు సేవించగా ఆపై వచ్చిన అమృతాన్ని దేవతలు సేవించారని పురాణాల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఘట్టాన్ని కళ్లకు కట్టే విధంగా చూపడానికి గణేశ్ అనే భక్తుడు రెండు నెలలుగా శ్రమించాడు. అతనికి స్థానిక యువకులు సహకారం అందించారు. దీంతో సాగరమథనానికి కవ్వమైన మందగిరిని 15 అడుగుల ఎత్తులో నిర్మించి శంఖువులతో అలంకరించారు. 50 అడుగుల పొడవుతో కొండను చిలికేందుకు తాడుగా వాడిన ఐదు తలల వాసుకీని తయారుచేశారు. రుద్రాక్షలతో వాసుకి తలలను తయారు చేశారు. వాసుకీని పట్టుకొని కొండను చిలికేలా ఒకవైపు దేవతల శిలారూపాలు, ఒకవైపు రాక్షసుల శిలారూపాలు అమర్చారు. కొండ నీటిలోకి జారిపోకుండా మహావిష్ణువు కూర్మావతారంలో పట్టుకున్న పురాణ కథకు రూపంగా కొండ అడుగు భాగంలో కూర్మావతారంలో మహావిష్ణువును కూడా సిద్ధం చేశారు. సాగరాన్ని మథనం చేస్తే తొలుత వచ్చిన హాలాహలాన్ని తాగే గరళకంఠుడి ప్రతిమను, రుద్రాక్ష లింగాన్ని కొండపక్కనే ఆకర్షణీయంగా ఏర్పాటుచేశారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు

పుత్తూరు: స్థానిక జీడీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్ కుమారుడి వివాహానికి హాజరైన మాజీ మంత్రి ఆర్కే రోజా నూతన వధూవరులు దిలీప్‌కుమార్, నిషాను ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా